కూలేందుకు సిద్ధంగా..

- అక్కరకు రాని తుపాను పునరావాస భవనాలు
- 30కి మూడు మాత్రమే కొత్తవి
- మిగిలినవి శిథిలావస్థలో మగ్గుతున్న వైనం
- ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పునరావాసం ప్రశ్నార్థకమే ?


బుచ్చియ్యపేటలో శిథిలావస్థలో ఉన్న తుపాను పునరావాస భవనం


కొత్తచోడిపల్లిపేటలో కూలేందుకు సిద్ధంగా ఉన్న తుపాను పునరావాస భవనం


పెరుమాళ్లపురంలో సచివాలయ సేవలకు వినియోగిస్తున్న తుపాను పునరావాస భవనం

తొండంగి: గత 50 ఏళ్లలో రాష్ట్రంలో 60 తుపానులు సంభవిస్తే వాటిలో 40 తుపానులు రాష్ట్రంలోని తీర ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపాయి. తుని నియోజకవర్గంలోని తొండంగి మండల పరిధిలో అద్దరిపేట నుంచి కొత్తచోడిపల్లిపేట వరకూ తీర ప్రాంత గ్రామాలతో పాటు మెట్ట గ్రామాల్లోనూ ప్రభుత్వం దీర్ఘకాలం క్రితం తుపాను పునరావాస భవనాలు నిర్మించింది. ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో తీరప్రాంత ప్రజలకు పునారావాసం ప్రశ్నార్థకంగా మారింది. కొన్నేళ్ల క్రితం పైడికొండ, ఆవుల మంద, లక్ష్మణుడుపేటల్లో మూడు భవనాలను నిర్మించారు. ఇవి మినహా మిగిలిన పునరావాస భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నా వీటి పరిస్థితి ఏమాత్రం మెరుగుపడటం లేదు.

11 పంచాయతీల్లో 27 భవనాలు

మండలంలోని సముద్రతీరప్రాంతం అధికంగా ఉండటంతో ప్రభుత్వం తొండంగి, పైడికొండ, కోదాడ, కృష్ణాపురం, శృంగవృక్షం, ఏవీ నగరం, కె.పెరుమాళ్లపురం, వేమవరం, యర్రయ్యపేట, జి.ముసలయ్యపేట, దానవాయిపేట తదితర 11 పంచాయతీల్లో 27 తుపాను పునరావాస భవనాలను దీర్ఘకాలం క్రితం నిర్మించింది. ఈ భవనాలకు గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తు నిర్మించారు. భవనం పక్కనే ప్రజలకు అవసరమైన మరుగుదొడ్లు నిర్మించారు. గతంలో తుపానులు వచ్చిన ప్రతి సందర్భంలోనూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తీర గ్రామాల ప్రజలకు ఈ భవనాల్లో తాత్కాలికంగా పునావాసం కల్పించే వారు. అక్కడే విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, భోజన ఏర్పాట్లు వంటి సౌకర్యాలు కల్పిస్తారు. కోదాడ, పైడికొండ, వేమవరం గ్రామాల్లో పునారావాస భవనాలు పూర్తిగా శిథిలమవ్వడంతో వాటిని నేలమట్టం చేశారు. కాగా మరికొన్ని గ్రామాల్లో భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాటిని తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మిస్తేగాని తీరప్రాంత ప్రజలకు తాత్కాలిక పునరావాసం కల్పించే వీలు లేదు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



మండలంలోని పలు తుపాను పునరావాస భవనాల శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నింటిని తొలగించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో సమీక్షించి దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

–వి.మురార్జీ, తహసీల్దార్, తొండంగి

తుపానుల సందర్భాల్లోనే హడావుడి

వాతావరణశాఖ తుపానులపై అప్రమత్తంగా ఉండాలని ప్రకటించగానే అధికార యంత్రాంగం అప్పటికప్పుడు తుపాను పునరావాస భవనాల వద్ద హడావుడి చేసి అనంతరం వాటి నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పలు భవనాల్లో కిటికీలు, గుమ్మాలు, ఇతర వస్తువులన్నీ పూర్తిగా దెబ్బతినడంతో పాటు కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో భవనం శ్లాబ్, మెట్లు కూడా పెచ్చులు ఊడిపడిపోతున్నాయి. మరుగుదొడ్లు కూడా వినియోగానికి ఏమాత్రం అనువుగా లేవు. వాస్తవానికి ఈ భవనాల నిర్వహణ పంచాయతీ రాజ్ విభాగం చూస్తుంది. కాగా ప్రస్తుతం పని చేస్తున్న ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు వీటి గురించి తనకు ఎటువంటి సమాచారం తెలియదని చెప్పడం గమనార్హం.

కొత్తవాటి నిర్వహణపై కానరాని శ్రద్ధ

తీరప్రాంతంలో పాత పునరావాస భవనాలు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో తుపాను విపత్తుల నివారణా సంస్థ రూ.90 లక్షలతో పైడికొండ, ఆవులమంద, లక్ష్మణుడుపేటలో నూతన పునరావాస భవనాలు నిర్మించారు. ఈ కేంద్రాల్లో సోలార్ విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను కూడా పట్టించుకోకపోవడంతో భవనాల్లో సోలార్ విద్యుత్ ఇతర సౌకర్యాలు కూడా నిరుపయోగంగా మారాయి.

వరుస తుపానులతో తప్పని ఇబ్బందులు

గత పదేళ్లలో వరుస తుపానులు సంభవించడంతో తీరప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. తుపాను పునరావాస భవనాల్లో వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. లైలా, నీలం, జల్, హుదుహూద్ తదితర తుపానుల సమయంలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. కొన్నిచోట్ల అధ్వానంగా ఉన్న తుపాను భవనాలకు రాలేక ఇళ్లకే పరిమితమయ్యారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

మండలంలోని తుపాను పునరావాస భవనాలన్నీ దాదాపు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మందు బాబులు, పేకాట రాయుళ్లకు ఈ భవనాలు అడ్డాగా మారాయి. బుచ్చియ్యపేట, పైడికొండ, వేమవరం, కోదాడ, గడ్డిపేట, హుకుంపేట తదితర గ్రామాల్లో భవనాలను అధికారులు పట్టించుకోకపోవడంతో బూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. కాగా తొండంగిలో భవనంలో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయాన్ని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నూతన భవనానికి మార్చారు. దీంతో పాత పునారావస భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పెరుమాళ్లపురంలో భవనంలో దీర్ఘకాలం పాటు హోమియో ఆస్పత్రిని నిర్వహించారు. అనంతరం పంచాయతీ సచివాలయం-1గా వినియోగిస్తున్నారు. గోర్సపాలెంలో భవనాన్ని బీసీ బాలికల వసతి గృహంగా వినియోగిస్తున్నారు. మరికొన్ని భవనాలను ధాన్యం నిల్వలు, రేషన్ షాపులు, టెంట్‌హౌస్‌ల గోడౌన్లుగా వినియోగిస్తున్నారు. శిథిల భవనాలు ఎప్పుడు కూలిపోతాయోనని బాధిత గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించేందుకు గాను అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీ (ఎంఎస్సీ) ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎస్ఈటీ, ఎన్ఈటీ, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు తగిన ధ్రువపత్రాలను కెమిస్ట్రీ డిపార్టుమెంట్‌లో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు 24న ఇంటర్వ్యూ, డెమో క్లాస్‌కు హాజరు కావాలని కోరారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో చేరికలకు స్పాట్ కౌన్సెలింగ్

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మిగిలి ఉన్న ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.లలిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీజీ సెట్-2024లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ కెమిస్ట్రీ డిపార్టుమెంట్‌లో హాజరు కావాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందికి శిక్షణ

కిర్లంపూడి: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారయంత్రాంగం సిద్ధమవుతోంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం మండల వ్యసాయశాఖ అధికారి జోకా అమృత అధ్యక్షతన వీఏఏ, వీహెచ్ఏ, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. తహసీల్దార్ జె.చిరంజీవి, పౌరసరఫరాల శాఖ ఏఎంటీ విజయ్ కుమార్ సిబ్బందికి ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ నిబంధనలను వివరించారు. తేమ పరీక్షలు, నాణ్యతా ప్రమాణాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి అభినందనలు


బదిలీపై వెళ్లిన పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న సీఐ గీతారామకృష్ణ

తుని: ఐదు సంవత్సరాల పాటు అంకితభావంతో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన పోలీసు సిబ్బందిని పట్టణ సీఐ గీతారామకృష్ణ అభినందించారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్లో శుక్రవారం అభినందన సభ జరిగింది. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిన 18 మంది సిబ్బందిని సీఐ సన్మానించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలిగితే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభం


తుని ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్ప మాలధారులు

తుని: శివదుర్గ, అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కట్రాళ్ల కొండపై వేంచేసిన అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులకు అన్నదానాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ అన్నదానం డిసెంబర్ 22 (64 రోజులు) వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకూ అన్నదానం నిర్వహిస్తామన్నారు. స్వామి, శివ, భవానీ మాలధారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీరభద్రుని గద్దెలో అన్నదానం

గోకవరం: స్థానిక వీరభద్రునిగద్దె వద్ద శుక్రవారం భారీ అన్నదానం జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు రూ.1.70 లక్షలు విరాళం అందజేశారు. సుమారు ఐదు వేల మంది అన్నదానంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు సూచించారు. మండలంలోని రాచపల్లిలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మీకాంతం, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ధర్నా


తునిలో విద్యుత్‌శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

తుని: విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. సీపీఎం తుని శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ ఉపకేంద్రం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రజలపై మోపుతున్న రూ.8,114 కోట్ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సక్కిళ్ల శ్రీనివాస్, గొర్ల రమణ, నాగేశ్వరరావు, సత్తిబాబు, సునీల్‌రావు పాల్గొన్నారు.

మురళీరాజుకు అభినందనల వెల్లువ


ధర్మవరంలో మురళీరాజును కలిసిన యనమల కృష్ణుడు, పార్టీ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు (మురళీరాజు)ను తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఆ పార్టీ నేత యనమల కృష్ణుడు మర్యాదపూర్వంగా కలిశారు. గురువారం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో మురళీరాజు వైఎస్సార్ సీపీలో చేరారు. దీంతో యనమల కృష్ణుడు మండలంలోని ధర్మవరంలో మురళీరాజు స్వగృహానికి వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు మురళీరాజును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మురళీరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుతో కలిసి నియోజకవర్గంలో పార్టీ పురోభివృద్ధి పాటుపడతానన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మొల్లి వీరబాబు, దడాల సతీష్, వైఎస్సార్ సీపీ నేతలు కొండపల్లి అప్పారావు, పోల్నాటి శేషగిరి, అనకాపల్లి నూకరాజు, జువ్వల దొరబాబు, నానిపల్లి చంటి, సానా తాతీలు, గొనగాల గోపి, గదుల శివ తదితరులు పాల్గొన్నారు.

74 ఉపాధి పనులకు ఆమోదం

తుని రూరల్: మండలంలోని డి.పోలవరంలో 2025-26 సంవత్సరంలో చేపట్టేందుకు గుర్తించిన 74 పనులను గ్రామ సభ ఆమోదించినట్టు ఎన్ఆర్ఈజీఎస్ జేఈ ఆంజనేయులు తెలిపారు. డి.పోలవరంలో శుక్రవారం టెక్నికల్ అసిస్టెంట్ మహాలక్ష్మి అధ్యక్షతన ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా జేఈ మాట్లాడుతూ కూలీలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనులు గుర్తించినట్టు తెలిపారు.ఈ పనులకు ప్రాథమికంగా రూ.2.44 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామన్నారు. తొలుత పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.25 లక్షలతో నిర్మించే ఐదు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ సుర్ల గాంధీ, నాయకులు పలకా సోమేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

కార్తిక మాస సమన్వయ కమిటీ సమావేశం వాయిదా

అన్నవరం: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కార్తిక మాసంలో ప్రారంభం కానుంది. కాగా కార్తిక మాసంలో సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తుల కోసం దేవస్థానంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు శనివారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ, దేవస్థానం అధికారుల సమన్వయ కమిటీ సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశం మళ్లీ వచ్చే వారం జరుగనుంది. ఇప్పటికే ఈ సమావేశానికి హాజరు కావాలని వివిధ శాఖల అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈఓ కె.రామచంద్రమోహన్‌కు అధికారిక సమావేశాలు ఉండడంతో ఈ సమావేశం వాయిదా పడింది.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ, పరిచారకులు ఫణి, బాలు, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 40 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు. దేవస్థానానికి రూ.30 వేల ఆదాయం వచ్చింది.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహామూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఆరుగుల మోషే తదితరులు

తుని: స్థానిక కొండవారిపేటకు చెందిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పట్టణ కో కన్వీనర్ గుండుంపల్లి సింహాచలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే బృందం శుక్రవారం సింహాచలం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం, 50 కేజీల బియ్యం అందజేశారు. అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తొమ్మంద్ర రమేష్, తుమ్మలపల్లి కుమార్, గంపల బాబూరావు, మోటుకూరి ఏసుబాబు, ముప్పిడి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన

గండేపల్లి: విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు శుక్రవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ ఫైర్-2024 పేరిట ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతిష్ఠాత్మక అమెరికన్ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో ఈ ఫైర్‌కు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, విద్యావేత్తలు హాజరైనట్టు చెప్పారు. తులసీ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ (యూఎన్‌టీ), వెబ్‌స్టార్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ అలబామా, మిడిల్ టేనస్సీస్ స్టేట్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినా ఆఫ్ స్టేట్, ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రూజ్‌వెల్ట్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు పాల్గొని విద్యా కార్యక్రమాలు, స్కాలర్‌షిప్, దరఖాస్తు విధానం, క్యాంపస్ జీవితంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు కార్యక్రమంలో డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ఎస్.రమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

ప్రత్తిపాడు: క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రావూరి సుధ సూచించారు. ప్రత్తిపాడులో శుక్రవారం సాయంత్రం బీజేపీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచే బీజేపీని పటిష్టపరచాలంటే సాధ్యమైనంత వరకూ ఎక్కువ మందికి పార్టీ సభ్యత్వం కల్పించాలన్నారు. సాధారణ సభ్యత్వం గురించి కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం గ్రామంలోని డైలీ మార్కెట్ సెంటర్, జక్కా వారి వీధి తదితర ప్రదేశాలలో జరుగుతున్న పార్టీ సభ్యత్వ సేకరణలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రావూరి సుధ పాల్గొన్నారు.కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శింగిలిదేవి సత్తిరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కొరిగడ్డ గంగాధర్, పార్టీ నాయకులు రాజబాబు, రామకృష్ణ యాదవ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బృందగానం పోటీలు


బృందగానం పోటీల్లో విజేతలతో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

తుని: స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో భారత వికాస్ పరిషత్(బీవీకే) ఆధ్వర్యంలో శుక్రవారం బృందగానం పోటీలు నిర్వహించారు. పట్టణంలో 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా లయోలా స్కూల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు అతిథులు, నిర్వాహకులు షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మంతెన సూర్యనారాయణ రాజు, భారత వికాశ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


డి.పోలవరంలో రైతులకు అపరాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ అశోక్ కుమార్

తుని రూరల్: ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని డి.పోలవరంలో జాతీయ ఆహార భద్రత మిషన్, పంట సరళి ఆధారిత ప్రదర్శనలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఎరువుల యాజమాన్యం, అధిక దిగుబడులకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఎకరాకు నత్రజని 35 కిలోలు, భాస్వరం 34 కిలోలు, పొటాష్ 20 కిలోలు వాడుకోవాలన్నారు. జింకు లోపం నివారణకు జింకు సల్ఫేట్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరికోతలు అనంతరం అపరాల సాగుతో అదనపు ఆదాయం పొందాలని సూచించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీదేవి ఉత్సవాలు


గౌరీదేవిని పుట్టింటికి తీసుకువస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకరుల (గౌరీదేవి)ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అట్లతద్దికి ఒక రోజు ముందు అనగా శుక్రవారం గౌరీదేవిని పుట్టింటికి తీసుకువచ్చారు. కాగా ఈ ఉత్సవాలను సంక్రాంతి వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

కిర్లంపూడి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్టు ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి, భూపాలపట్నం, గోనేడ, బూరుగుపూడి గ్రామాల్లో రూ.3.10 కోట్ల వ్యయంతో చేపట్టే 13 పనులకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ భూమి పూజ చేస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి రీ-సర్వే గ్రామ సభలు

కిర్లంపూడి: మండల పరిధిలో శనివారం నుంచి నవంబర్ 12వ తేదీ వరకు భూముల రీ సర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జె.చిరంజీవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని తామరాడ, గోనేడ, రాజుపాలెం, ముక్కొల్లు, కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి, వేలంక, గెద్దనాపల్లి, భూపాలపట్నం, సోమవరం, కృష్ణవరం, వీరవరం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రైతులకు రీ సర్వేపై సమస్యలు ఉంటే గ్రామ సభల దృష్టికి తీసుకురావాలని సూచించారు.